సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం । 19 । ఏప్రిల్ । 2025

శిలువధారీ.. నీ శరణుకోరి

గుడ్ ఫ్రైడే సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న చెర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. క్రైస్తవులు భారీగా తరలివచ్చి శిలువలో యేసు పలికిన ఏడు మాటలను ధ్యానించారు. పలుచోట్ల క్రీస్తు శిలువ వృత్తాంతాన్ని ప్రదర్శించారు. సర్వ మానవాళి పాప విమోచన కోసం యేసు శిలువలో తన ప్రాణం అర్పించారని పాస్టర్లు వివరించారు.

– సాక్షి బృందం



హిందూపురం సీఎస్ఐ చర్చిలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు



కనగానపల్లి మండలం సీఎన్ కోటలో క్రీస్తు శిలువ వృత్తాంతాన్ని వివరిస్తూ సాగిన ప్రదర్శన

న్యూస్‌రీల్

గుడ్ ఫ్రైడే రోజూ పనిచేసిన పాఠశాలలు

- అసంతృప్తి వ్యక్తం చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులు



సెలవు రోజు పాఠశాలకు హాజరైన విద్యార్థులు, ఉపాధ్యాయులు

పుట్టపర్తి: కూటమి సర్కార్ అవగాహన లోపం, విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం విద్యార్థులు, ఉపాధ్యాయులకు శాపంగా మారింది. ఆప్షనల్ హాలిడేలను ఇష్టానుసారం ఇవ్వడంతో పాఠశాలల పనిదినాలు తగ్గిపోయాయి. ఒక విద్యా సంవత్సరం పాఠశాలలు కనీసం 220 రోజులు పనిచేయాల్సి ఉండగా... విద్యాసంవత్సరం చివరికొచ్చేసరికి సర్దుబాటు చేయడం ఇబ్బందిగా మారింది. దీంతో గుడ్ ఫ్రైడే రోజూ పాఠశాలలు పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రానున్న ఆదివారమూ తరగతులు ఉంటాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం క్రైస్తవులంతా శుభశుక్రవారం ప్రార్థనల్లో ఉండగా.. క్రైస్తవ విద్యార్థులు, ఉపాధ్యాయులు మాత్రం తరగతి గదుల్లో గడపాల్సి వచ్చింది. గత శ్రీరామ నవమి రోజున కూడా ఉపాధ్యాయులకు సెలవు ఇవ్వకుండా 10వ తరగతి 'స్పాట్' విధులు కేటాయించారు. ప్రస్తుతం గుడ్ ఫ్రైడే రోజున పాఠశాలలు నడపడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వాహన తనిఖీలు ముమ్మరం

- స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న ఎస్పీ రత్న




వాహన తనిఖీ పరిశీలిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: మద్యం, గంజాయి అక్రమ రవాణా, డ్రంక్ అండ్ డ్రైవ్‌ను అరికట్టేందుకు జిల్లా పోలీసులు వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. ఇందుకోసం గురువారం రాత్రి స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఎస్పీ రత్న స్వయంగా పుట్టపర్తి రూరల్ పరిధిలోని ధర్మవరం–కోడూరు ప్రధాన రహదారిలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనాలు తనిఖీ నిర్వహించారన్నారు. జిల్లాలోని అన్ని పోలీసు సబ్‌డివిజన్లలో వాహన తనిఖీలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. వాహనదారులు రికార్డులు అందుబాటులో ఉంచుకోవాలని, చలానాలు పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ విజయకుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ సురేష్, ఎస్ఐ లింగన్న, ఆర్ఐ మహేష్‌తో పాటు సిబ్బంది ఉన్నారు.

చిరు వ్యాపారులను చిదిమేసిన ప్రమాదం

- కర్ణాటకలో రోడ్డు ప్రమాదం
- ముగ్గురు జిల్లా వాసుల మృతి



మృతులు నాగభూషణ, శీగిపల్లి మురళి, నాగరాజు

హిందూపురం అర్బన్/పరిగి : వారు ముగ్గురూ గొర్రెల వ్యాపారులు. ఎక్కడెక్కడో తిరిగి గొర్రెలను తీసుకువచ్చి వాటిని విక్రయించుకుని కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఈ క్రమంలోనే గురువారం గొర్రెల కొనుగోలుకు వెళ్లిన వారు తిరిగిరానిలోకాలకు వెళ్లిపోయారు. శుక్రవారం తెల్లవారుజామున కర్ణాటకలో జరిగిన రోడ్డుప్రమాదంలో పరిగి మండలం ధనాపురం గ్రామానికి చెందిన నాగభూషణ(45), శీగిపల్లికి చెందిన మురళి (40), హిందూపురం మండలం కొటిపికి చెందిన నాగరాజు(38) మృత్యువాత పడగా బాధిత కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది.

యజమానులను కోల్పోయి...

నాగభూషణ మటన్ దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకునే వాడు. ఆయన భార్య సరోజమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం ఉన్నారు. ఇక మురళి తల్లితో కలిసి ఉండేవాడు. నాగరాజుకు భార్య, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. మృతులంతా కుటుంబాలకు ఆధారం కావడంతో ఆయా కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారింది. విషయం తెలియగానే కుటుంబీకులంతా రాయచూరు రిమ్స్ వద్దకు పరుగుతీశారు. అక్కడ నిర్జీవంగా ఉన్న తమ వారిని చూసి ఇక తమకు దిక్కెవరంటూ కన్నీరుమున్నీరయ్యారు.

బెట్టింగ్‌లో మునక

క్రేజీ గేమ్ క్రికెట్. పొట్టి ఫార్మాట్, వన్డే, టెస్టు ఏదైనా సరే ఆట చూసేందుకు అభిమానులు అమితాసక్తి కనబరుస్తారు. ఆటను ఆటగా ఆస్వాదించినంత వరకు బాగానే ఉంటుంది. అయితే కొంతమంది కుర్రాళ్లు ఆ ఆటపై పందెం కాని సునాయాసంగా డబ్బు సంపాదించాలనుకుంటున్నారు. పాకెట్ మనీతో మొదలైన బెట్టింగ్ అత్యాశతో అప్పులు చేసే స్థాయికి తీసుకెళ్తోంది. ఆ తర్వాత అప్పుల చట్రబంధం నుంచి తప్పించుకోవడానికి నేరస్తులుగా మారుతున్నారు.



- రోజూ రూ.150 కోట్ల వ్యాపారం
- తాడిపత్రి కేంద్రంగా భారీగా బెట్టింగ్
- ఆర్థికంగా చితికి... చైన్‌స్నాచర్లుగా మారుతున్న యువత
- ఇంటర్మీడియెట్ విద్యార్థులూ బెట్టింగ్ మీద ఆసక్తి
- ఐపీఎల్ మ్యాచ్‌లతో ఆర్థికంగా పతనావస్థకు

సాక్షి ప్రతినిధి, అనంతపురం : క్రికెట్.. ప్రేక్షకులను రంజింపచేయడమేమో కానీ బెట్టింగ్ రూపంలో పలువురి జీవితాలను కబళిస్తోంది. కుటుంబాలకు కుటుంబాలే దుఃఖసాగరంలో మునిగిపోతున్న దుస్థితి. ఎక్కడో జరుగుతున్న ఆటపై ఇక్కడ పందెం కాస్తూ క్రికెట్‌ను అతిపెద్ద జూద స్థావరంగా మార్చుకున్న యువతకు ఇదొక శాపంగా పరిణమించింది. పండ్ల తోటలు, మెట్ట పైర్లకు వేదికగా, కరువు ప్రాంతంగా ముద్రపడిన ఉమ్మడి అనంతపురం జిల్లా ఇప్పుడు అతిపెద్ద బెట్టింగ్ కేంద్రంగా మారి వందలాది కుటుంబాలను చిదిమేస్తోంది. ఐపీఎల్ మ్యాచ్‌లు ఒక్కరోజులోనే ఎంతోమంది యువకుల జీవితాలను కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి.

ఒక్కో మ్యాచ్‌కు రూ.150 కోట్ల బెట్టింగ్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒక్కో ఐపీఎల్ మ్యాచ్‌కు రూ.150 కోట్లకుపైగా బెట్టింగ్ జరుగుతున్నట్టు అంచనా. బెట్టింగ్‌లో ఎక్కువగా 30 ఏళ్లలోపు యువత పాల్గొంటున్నట్టు పోలీసులు చెబుతున్నారు. అంచనా. మ్యాచ్ మొత్తానికి ఒక పందెం, ఓవర్ టు ఓవర్ ఇలా రకరకాలుగా పందెం కాస్తున్నారు. నాలుగు రోజుల కిందట పంజాబ్ కింగ్స్ లెవెన్, కోల్‌కతా నైట్ రైడర్స్ మ్యాచ్ జరిగింది. ఇందులో పంజాబ్ కింగ్స్ లెవెన్ 111 పరుగులు మాత్రమే చేసింది. కోల్‌కతా గెలుస్తుందని వెయ్యికి లక్ష రూపాయలు పందెం జరిగింది. పంజాబ్ ఓడిపోతుందని బెట్టింగ్ కాసిన వాళ్లు బికారులైపోయారు.

ఆర్థికంగా చితికి దొంగలుగా మారి..

నాలుగు రోజుల క్రితం ఆరుగురు చైన్‌స్నాచర్లను అనంతపురం పోలీసులు పట్టుకున్నారు. వీరి పూర్వాపరాలు ఆరా తీస్తే.. అందరూ క్రికెట్ బెట్టింగ్ ఆడి ఆర్థికంగా అప్పులపాలైన వారే. అప్పుల నుంచి గట్టెక్కేందుకు చైన్‌స్నాచర్లుగా మారారు. ఎక్కడ ఒంటరి మహిళలు కనిపించినా బంగారు గొలుసులు లాక్కెళ్లడం, వచ్చిన డబ్బుతో జల్సా చేయడం.. ఇదీ పరిస్థితి. వీళ్లే కాదు కదిరి, ధర్మవరం, హిందూపురం, అనంతపురం, ఉరవకొండ ఇలా పలు ప్రాంతాల్లో క్రికెట్ బెట్టింగుల్లో నష్టపోయిన వారు దొంగలుగా మారారు. కొందరు రుణదాతల ఒత్తిడి భరించలేక బలవన్మరణానికి పాల్పడి తల్లిదండ్రులకు గర్భశోకం మిగుల్చుతున్నారు.

తాడిపత్రి కేంద్రంగా బుకీలు

గంజాయి, మట్కాకే కాదు ఇప్పుడు బుకీలకూ తాడిపత్రి కేంద్ర బిందువైంది. గొలుసు దొంగలు (చైన్‌స్నాచర్లు) దొరికిన రెండు రోజులకే తాడిపత్రిలో క్రికెట్ బుకీలు పోలీసులకు చిక్కారు. దొరికింది ఏడుగురే అయినా ఇంకా చాలామంది ఉన్నట్టు పోలీసుల అంచనా. అమాయక యువకులకు ఆశ చూపి బెట్టింగ్ ఉచ్చులోకి దించుతున్నారు. సర్వస్వం కోల్పోయాక కానీ కుర్రాళ్లు తెలుసుకోలేరు. ఇంటర్మీడియెట్ కుర్రాళ్లు సైతం బెట్టింగ్ ఉచ్చులో ఇరుక్కుని విలవిలలాడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో క్రికెట్ బెట్టింగ్ ఒక విషవలయంలా మారింది.

జీవితాలు ఫణంగా పెట్టొద్దు



పంపాచారి, షాకీర్, నాగార్జున, ఫజిల్ అహ్మద్ ఈ నలుగురూ పేకాట, క్రికెట్ బెట్టింగ్‌లలో నష్టపోయి దొంగలుగా మారారు. ఈజీ మనీకోసం ఇలా బెట్టింగ్.. ఆ తర్వాత దొంగతనాలు చేయడం జరుగుతోంది. యువత కెరీర్ చూడాలి కానీ బెట్టింగ్ వైపు కాదు. క్రికెట్ బెట్టింగ్ ప్రమాదకరం. ఆటను ఆటవరకే ఆస్వాదించాలి కానీ బెట్టింగ్ వైపు చూడకూడదు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ఆర్థిక స్థితిగతులపై ఒక నిఘా వేసి ఉంచాలి. పేకాట, బెట్టింగ్, ఆన్‌లైన్ గేమింగ్ వైపు వెళ్లి జీవితాలు ఫణంగా పెట్టకండి.

– పి.జగదీష్, ఎస్పీ, అనంతపురం

ఉమ్మడి జిల్లాలో బెట్టింగ్ వివరాలు

బెట్టింగ్ బుకీ ముఠాల సంఖ్య	30-40
ఒక్కో ఐపీఎల్ మ్యాచ్‌కు బెట్టింగ్	రూ.150 కోట్ల పైనే
బెట్టింగ్ ఆడుతున్న వారి సంఖ్య	30,000 అంచనా
బెట్టింగ్ ఆడుతున్న వారి వయస్సు	35 ఏళ్ల లోపు
ఆత్మహత్య చేసుకుంటున్న బాధితులు నెలకు	10కి పైనే

సింహవాహనంపై చౌడేశ్వరీదేవి



అమడగూరు: వార్షిక ఉత్సవాల్లో భాగంగా అమడగూరులో వెలసిన చౌడేశ్వరీదేవి శుక్రవారం సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాల అలంకరణలో సింహవాహనంపై కనిపించిన ఆ అమ్మలగన్న అమ్మను దర్శించుకుని భక్తులు తరించారు. అనంతరం అమ్మవారిని బెల్లీరథంపై కొలువుదీర్చి ఆలయం నుంచి ఊరేగింపుగా గ్రామ నడిబొడ్డున ఉన్న ఉట్టి వద్దకు తీసుకెళ్లారు. అక్కడ భక్తుల పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి ఊరేగింపునకు ముందు మంగళ వాయిద్యాలు, డప్పుమేళాలకు అనుగుణంగా యువకులంతా చిందులేస్తూ ఆడిపాడారు. భక్తుల కోసం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు శనివారం హంసవాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

తప్పులకు ఎంఈఓలు, హెచ్‌ఎంలదే బాధ్యత

- నిబంధనల మేరకే పునర్వ్యవస్థీకరణ
- ఉమ్మడి జిల్లా డీఈఓల ఆదేశం



పాఠశాలల పునర్వ్యవస్థీకరణ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం జయచంద్ర, చిత్రంలో రెండు జిల్లాల డీఈఓలు

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాశాఖలో 117 జీఓకు ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చిన పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ పకడ్బందీగా, పారదర్శకంగా జరగాలని, ఏ చిన్న తప్పు జరిగినా ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులదే పూర్తి బాధ్యత అని అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల విద్యాశాఖ అధికారులు ఎం.ప్రసాద్‌బాబు, క్రిష్టప్ప హెచ్చరించారు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తున్న నేపథ్యంలో పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ వేగవంతం చేశారు. తుదిదశకు చేరుకోవడంతో ఎలాంటి తప్పులూ ఉండకూడదనే ఉద్దేశంతో శుక్రవారం అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో ఉమ్మడి జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. రెండు జిల్లాల విద్యాశాఖ అధికారులతో పాటు అసిస్టెంట్ డైరెక్టర్లు హాజరయ్యారు. 15 రోజుల నుంచి సాగుతున్న ఎక్సర్‌సైజ్‌లో భాగంగా చిన్నచిన్న పొరబాట్లు జరిగాయని, డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాల్సిన సమయం దగ్గర పడడంతో స్కూళ్ల వారీగా ఎన్ని పోస్టులున్నాయి... ఎన్ని ఖాళీలున్నాయనేది పక్కాగా తేల్చాల్సి ఉందని డీఈఓలు స్పష్టం చేశారు. ఆర్టీఈ ప్రకారం పాఠశాలలకు కేటాయించాల్సిన ఉపాధ్యాయుల లెక్కల వివరాలను పక్కాగా తేల్చాలని ఆదేశించారు. కాగా, సమావేశానికి ఉమ్మడి జిల్లా నుంచి హాజరైన ఎంఈఓలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, అకౌంటెంట్లకు అధికారులు కనీసం భోజన వసతి కల్పించలేదు. అందరూ తరచూ బయటకు వెళ్తుండటంతో మధ్యాహ్నం తర్వాత తాగునీరు ఏర్పాటు చేశారు.

ఉమ్మడి అనంతను సోలార్ హబ్‌గా మారుస్తాం

- మడకశిరలో రూ.7 వేల కోట్లతో సోలార్ పార్క్
- మంత్రులు అనగాని, గొట్టిపాటి, సత్యకుమార్, సవిత



మడకశిర మండలం వైబీహళ్లిలో సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు సత్యప్రసాద్, రవికుమార్, సత్యకుమార్, సవిత

మడకశిర: ఉమ్మడి అనంతపురం జిల్లాను సోలార్, ఇండస్ట్రియల్ హబ్‌గా మారుస్తామని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత తెలిపారు. శుక్రవారం వారు మడకశిర మండలం వైబీహళ్లి, కదిరేపల్లి క్రాస్, అగళి మండలం ఇనగలూరు, అమరాపురం మండలం శివరం గ్రామాల్లో నిర్మించన విద్యుత్ సబ్ స్టేషన్లను ప్రారంభించారు. గుండుమలలో కొత్త విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. మడకశిర ఆర్‌అండ్‌బీ బంగ్లాలో కలెక్టర్ చేతన్, జేసీ అభిషేక్ కుమార్‌తో జిల్లా అభివృద్ధిపై సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని మంత్రి అనగాని ప్రసాద్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 'పీఎం సూర్యఘర్' కింద 20 లక్షల కనెక్షన్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. రాయలసీమను సోలార్, విండ్ విద్యుత్ ఉత్పత్తికి అనుకూల ప్రాంతంగా అభివృద్ధి చేస్తామన్నారు.

మడకశిరలో సోలార్ పార్క్..

మడకశిరలో రూ.7 వేల కోట్లతో సోలార్ పార్కును ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. జల్ జీవన్ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తామన్నారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత మాట్లాడుతూ... చంద్రబాబుతోనే ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధి సాధ్యమన్నారు. జిల్లాలో గొల్లపల్లి రిజర్వాయర్, కియా పరిశ్రమను నిర్మించిన ఘనత చంద్రబాబుదేనన్నారు. సమావేశంలో ఎంపీ పార్థసారథి, జిల్లా ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, పరిటాల సునీత, సింధూరరెడ్డి, కందికుంట వెంకటప్రసాద్, అనంతపురం జిల్లా ఎమ్మెల్యేలు దగ్గుబాటి ప్రసాద్, అలిమినేని సురేంద్రబాబు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

వచ్చారు.. వెళ్లారు..!

- రెవెన్యూ డివిజన్, రొళ్లలో 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుపై నోరుమెదపని మంత్రులు

మడకశిర: కూటమి ప్రభుత్వం కొలువుదీరాక తొలిసారి నలుగురు మంత్రులు మడకశిరలో పర్యటించారు. దీంతో నియోజకవర్గంపై వరాలు కురిపిస్తారని అంతా భావించారు. కానీ వారు అందుకు విరుద్ధంగా వ్యవహరించారు. వైఎస్ జగన్ హయాంలో నిర్మించిన నాలుగు విద్యుత్ సబ్ స్టేషన్లకు ప్రారంభోత్సవాలతో హడావుడి చేశారు. ఆ తర్వాత చంద్రబాబును, స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజును పొగిడేందుకే సమయమంతా వెచ్చించారు. దీంతో స్థానికులు తీవ్ర నిరాశ చెందారు. మడకశిర కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై గానీ, రొళ్ల, అగళి మండలాల్లో విద్యుత్ సమస్యలు తీర్చేందుకు రొళ్లలో 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుపై గానీ ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆరు సబ్ స్టేషన్లు అవసరం కాగా, 3 స్టేషన్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడంపై జనం పెదవి విరిచారు.

వక్ఫ్ సవ'రణం'... నిరసనాగ్రహం



వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా హిందూపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



వక్ఫ్ సవరణ చట్టం మాకొద్దంటూ నినదిస్తున్న ముస్లింలు

- వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాలని 'పురం'లో భారీ ర్యాలీ
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు
- ముస్లింల నిరసనకు మద్దతు తెలిపిన వైఎస్సార్ సీపీ
- ర్యాలీలో పాల్గొన్న ఉషశ్రీ చరణ్, టీఎన్ దీపిక

హిందూపురం: వక్ఫ్ సవరణ చట్టంపై నిరసనాగ్రహం పెల్లుబుకింది. ముస్లింలకు నష్టం కలిగించే చట్టాన్ని రద్దు చేయాల్సిందేనంటూ ముస్లింలంతా ముక్తకంఠంతో నినదించారు. వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా శుక్రవారం హిందూపురంలో ముస్లింలు కదం తొక్కారు. జమాతుల్మా–ఇ– హింద్ జామియా మసీదు, ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. బ్యానర్లు, ప్లకార్డులు, జాతీయ జెండాలు పట్టుకుని వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. వందలాది మంది ముస్లింలు జామియా మసీదు నుంచి భారీ ర్యాలీ బయలుదేరి మెయిన్‌రోడ్డు గుండా గురునాథ్ సర్కిల్, నెహ్రూ రోడ్డు, అంబేడ్కర్ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, గాంధీ సర్కిల్ చేరుకున్నారు. అనంతరం పాతబస్టాండ్, సద్భావన సర్కిల్ మీదుగా జమియా మసీదుకు చేరుకున్నారు. సద్భావన సర్కిల్‌లో సామూహిక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం మొండిగా అమల్లోకి తెచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించబోమన్నారు. కేంద్ర ప్రభుత్వం ముస్లింలను అణచి వేయడానికే వక్ఫ్ సవరణ చట్టాన్ని తీసుకువచ్చిందని మండిపడ్డారు. వక్ఫ్ సవరణకు బిల్లుకు మద్దతు తెలిపిన టీడీపీ, జనసేన పార్టీలకు తగిన గుణపాఠం చెప్పితీరుతామన్నారు. కార్యక్రమంలో జామియా మసీదు ముత్తవల్లి నూరుల్లాఖాన్, మాజీ కలీంముల్లా, ముత్తవల్లిలు తల్హాఖాన్, అబ్దుల్ అజీజ్, షాఫిక్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్.దీపిక, నియోజకవర్గ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి, ఆగ్రోస్ మాజీ చైర్మన్ నవీన్‌నిశ్చల్, చౌళూరు మధుమతిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జబివుల్లా, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనంతపురం డీఐజీ షిమోషీ, ఎస్పీ రత్న, పోలీసు ఉన్నతాధికారులతో పాటు డీఎస్పీ మహేష్, స్థానిక సీఐలు రాజగోపాల్ నాయుడు, జనార్దన్, అబ్దుల్‌కరీం, ఆంజనేయులు తదితరులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం



వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. ఈ చట్టం వల్ల ముస్లింలకు తీరని అన్యాయం జరుగుతుంది. దీన్ని మేము ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోం. ముస్లింలను అణగదొక్కేందుకే ఈ చట్టాన్ని తెస్తున్నారని తెలుస్తోంది. వెంటనే ఈ చట్టాన్ని రద్దు చేయాలి. లేకపోతే కలిసి వచ్చే పార్టీలతో కలిసి దేశ వ్యాప్త ఆందోళనలకు శ్రీకారం చుడతాం.

– నూరుల్లాఖాన్, జామియా మసీదు ముతవల్లి, హిందూపురం

ముస్లింల అణచివేతకు కుట్ర



వక్ఫ్ సవరణ చట్టాన్ని నిరసిస్తూ హిందూపురంలో ముస్లింలు చేపట్టిన ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, నియోజకవర్గ సమన్వయకర్త దీపిక తదితరులు

చిలమత్తూరు: ముస్లిం సమాజాన్ని అణచివేసే కుట్రలో భాగంగానే వక్ఫ్ సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ అన్నారు. వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాలన్న డిమాండ్‌తో ముస్లింలు చేపట్టిన నిరసన ర్యాలీకి వైఎస్సార్ సీపీ మద్దతు తెలిపింది. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎస్ దీపిక, వేణురెడ్డి నిరసన ర్యాలీలో పాల్గొని మద్దతు పలికారు. అనంతరం ఉషశ్రీచరణ్ మీడియాతో మాట్లాడారు. ముస్లింల ఓట్లతో గద్దెనెక్కిన పార్టీలు... వారి అవసరం తీరాక అణచివేతకు సిద్ధమయ్యాని మండిపడ్డారు. వక్ఫ్ సవరణ బిల్లుకు తమ ఎంపీలతో మద్దతు తెలిపిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ముస్లింల ద్రోహులుగా మిగిలిపోయారన్నారు. వక్ఫ్ సరవణ బిల్లు పార్లమెంట్‌లో పాసయ్యాక చంద్రబాబు కల్లబొల్లి మాటలు చెబుతున్నారని, నిజంగా ముస్లింలపై ఆయనకు ప్రేమ ఉంటే వెంటనే వక్ఫ్ సవరణ చట్టంపై సుప్రీంలో పిటీషన్ వేయాలని డిమాండ్ చేశారు. టీఎస్ దీపిక మాట్లాడుతూ.. వక్ఫ్ చట్ట సవరణతో ముస్లిం హక్కులకు భంగం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముస్లింలపై ఇది కక్ష సాధింపులా కనిపిస్తోందన్నారు. ముస్లిం పక్షపాతి, మాజీ సీఎం వైఎస్ జగన్ వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా నిలబడ్డారని, సుప్రీంకోర్టులో పిటీషన్ కూడా వేశారన్నారు. ఏపీ ఆగ్రోస్ మాజీ చైర్మన్ నవీన్ నిశ్చల్ మాట్లాడుతూ.. వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమన్నారు. మైనార్టీల హక్కుల కోసం తాము రాజీలేని పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత వేణురెడ్డి, చౌళూరు మధుమతిరెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆసిఫుల్లా, వైఎస్సార్ సీపీ కురుబ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివ, మహేష్‌గౌడ్, చిలమత్తూరు మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి , జిల్లా కార్యదర్శి తిప్పేరుద్రయ్య, శివశంకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నాగరాజు, శబరీష్‌రెడ్డి, ప్రణయ్, శ్రీనివాసరెడ్డి, మైనారిటీ నేతలు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

పెనుకొండ: స్థానిక మారుతీ నగర్‌కు చెందిన మహేష్ (35) పెనుకొండ రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు... తాగుడుకు బానిసగా మారి జులాయిగా తిరిగే మహేష్... తన తోటి స్నేహితుడితో కలసి రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం సాయంత్రం మద్యం సేవించినట్లు ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. ఆ రోజు రాత్రికి ఆయన ఇంటికి చేరుకోలేదు. దీంతో శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టి రైల్వేస్టేషన్ సమీపంలో మహేష్ మృతదేహాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మహేష్‌కు భార్య వనిత, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అదనపు కట్నం వేధింపుల కేసు నమోదు

కదిరి టౌన్: బాధితురాలి ఫిర్యాదు మేరకు అత్తింటి వారిపై అదనపు కట్నం వేధింపుల కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు... కదిరి మున్సిపల్ పరిధిలోని నిజాంవలీ కాలనీలో నివాసముంటున్న షేక్ మెహతాజ్‌కు ఎనిమిదేళ్ల క్రితం కర్ణాటకలోని గానిపల్లికి చెందిన మస్తాన్ కుమారుడు అబ్దుల్‌నబీతో పెద్దల సమక్షంలో పెళ్లి చేశారు. పెళ్లి సమయంలో పెద్ద మొత్తంలో వరకట్నం, ఇతర కానుకలు చెల్లించారు. పెళ్లి అనంతరం అబ్దుల్‌నబీ కదిరికి మకాం మార్చి నిజాంవలీ కాలనీలో భార్యతో కలసి జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల అబ్దుల్‌నబీకి తల్లి, చెల్లెలు తరచూ ఫోన్ చేస్తూ అదనపు కట్నం తీసుకురావాలంటూ చెప్పేవారు. వారి మాటలతో ప్రభావితమైన అబ్దుల్‌నబీ సైతం భార్యను అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తూ వచ్చాడు. అదనపు కన్నం తీసుకురాకపోతే రెండో పెళ్లి చేసుకుంటానంటూ బెదిరింపులు చేసేవాడు. వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ అనంతరం భర్త, అతని తల్లి, చెల్లెలుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇంగ్లిష్ సార్లు లేరిక్కడ!

- ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లిష్ పాఠ్యాంశాల బోధనకు తీవ్ర ఆటంకం
- తీవ్రంగా నష్టపోతున్న విద్యార్థులు
- ఉమ్మడి జిల్లాలో ఆగిన పదోన్నతులు
- హైకోర్టు ఉత్తర్వులిచ్చినా పదోన్నతుల్లో వీడని చిక్కుముడి
- రాష్ట్రంలో ఒక్క ఉమ్మడి 'అనంత' జిల్లాలోనే ఈ దుస్థితి



అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని పలు ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లిష్ పాఠ్యాంశాలు బోధించే టీచర్లు లేరు. ఫలితంగా పదో తరగతి విద్యార్థులు ఇప్పటికే తీవ్రంగా నష్టపోయారు. 2023 జూన్‌లో అన్ని సబ్జెక్టులకు పదోన్నతులు కల్పించినా... హై కోర్టులో వివాదం కారణంగా ఇంగ్లిష్ టీచర్ల పదోన్నతులకు బ్రేక్ పడింది. ఇంగ్లిష్ పదోన్నతులు తమకు మాత్రమే కల్పించాలంటూ డిగ్రీలో ఇంగ్లిష్ ప్రధాన అంశంగా ఉన్న ముగ్గురు వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించారు. దీంతో పదోన్నతులు జరగకుండా హైకోర్టు స్టే విధించింది. అప్పట్లో 230 ఎస్జీటీలకు ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు దక్కాల్సి ఉండగా.. ప్రస్తుతం ఈ సంఖ్య 280కు చేరింది. వాస్తవానికి 2023, జనవరిలో సీనియార్టీ జాబితా తయారు చేసి తాత్కాలిక పదోన్నతులు కల్పించారు. జూన్‌లో రెగ్యులర్ పదోన్నతులు ఇచ్చే సమయంలో కోర్టు కేసు కారణంగా ఈ ప్రక్రియ కాస్త ఆగిపోయింది.

నష్టపోతున్నది విద్యార్థులే

ఉమ్మడి జిల్లాలోని టి.వీరాపురం, నేత్రపల్లి, 74–ఉడేగోళం, డి.కొండాపురం, భూపసముద్రం, గుమ్మఘట్ట, గోనబావి, గొల్లపల్లి, కలుగోడు, తాళ్లకెర, రంగచేడు, భూపసముద్రం, పూలకుంట, గొల్లపల్లి, మురడి, మండ్లి, అపిలేపల్లి, బసాపురం, బెస్తరపల్లి, యర్రగుంట, మలయనూరు, తెంగల్లు, లక్ష్మంపల్లి, కనకూరు, వలస, ఆగ్రహారం, కె.శివరం, హేమావతి, బుచ్చయ్యగారిపల్లి, బాచేహల్లి, శెట్టూరు, తిప్పనపల్లి గ్రామాల్లోని జిల్లాపరిషత్ యాజమాన్యంలోని ఉన్నత పాఠశాలలతో పాటు కేపీ దొడ్డి, తూముకుంట, మహానంతపురం, కరిగానపల్లి తదితర గ్రామాల్లోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఇంగ్లిష్ సబ్జెక్ట్ టీచర్ల కొరత తీవ్రంగా ఉంది. కుందుర్పి మండలంలోని ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలుండగా ఏ ఒక్క స్కూల్‌లోనూ ఇంగ్లిష్ టీచరు లేరు. అక్కడక్కడా కొన్ని పాఠశాలల్లో ఇతర పాఠ్యాంశాల టీచర్లతో ఇంగ్లిష్ బోధించేలా సర్దుబాటు చేసి విద్యాశాఖ అధికారులు మిన్నకుండిపోయారు. ఇంగ్లిష్ టీచర్ల కొరత కాస్త విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఆటంకంగా మారింది.

వీడని చిక్కుముడి..

ఇంగ్లిష్ టీచర్ల పదోన్నతుల వివాదంపై ఈ ఏడాది ఫిబ్రవరి 5న హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. పదోన్నతులపై దాఖలైన కేసులన్నీ డిస్పోజ్ చేస్తూ ఈ అంశంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకొని పదోన్నతులు కల్పించాలని తుది తీర్పునిచ్చింది. ఈ తీర్పు వెలువడి ఇప్పటికీ రెండు నెలలు దాటినా చిక్కుముడి వీడలేదు. మరోవైపు అర్హులైన ఎస్జీటీలకు అన్యాయం జరిగింది. మిగిలిన సబ్జెక్టులతో పోల్చుకుంటే ఇంగ్లిష్ పదోన్నతులు పొందే వారు రెండేళ్ల సీనియార్టీని కోల్పోయారు. వీరిలో కొందరు ఉద్యోగ విరమణ పొందారు. అయినా విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇప్పటికీ మేల్కొనలేదు.

ఇంగ్లిష్ బోధనకు ఆటంకం



ఉమ్మడి జిల్లాలోని చాలా ఉన్నత పాఠశాలల్లో రెగ్యులర్ ఇంగ్లిష్ టీచర్లు లేక పాఠ్యాంశాల బోధనకు ఆటంకం కలుగుతోంది. 2023 జనవరిలో తాత్కాలిక పదోన్నతులు పొందిన వారి రెగ్యులర్ ప్రమోషన్లు నిలిచిపోయాయి. ఇప్పటికే అమలులో ఉన్న జీఓ ప్రకారం యూజీ, పీజీలో ఇంగ్లిష్‌తో పాటు బీఈడీలో ఇంగ్లిష్ మెథడాలజీ ఉన్నవారికి సీనియార్టీ ప్రాతిపదికన పదోన్నతులు ఇస్తున్నారు. – వై.నాగభూషణ ఎస్జీ టీచరు

హైకోర్టు తీర్పు బుట్టదాఖలు



2023, జూన్‌లో దాఖలైన కేసులను డిస్పోజ్ చేస్తూ ఈ ఏడాది ఫిబ్రవరి 5న హైకోర్టు తీర్పు వెలువరించింది. పదోన్నతులపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలంటూ స్పష్టం చేసింది. అయినా ప్రభుత్వంలో చలనం లేకపోవడంతో విద్యార్థులతో పాటు టీచర్లూ తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికే రెండేళ్ల సీనియార్టీ కోల్పోయాం. వెంటనే అర్హులైన ఎస్జీటీలకు పదోన్నతులు కల్పిస్తే ఖాళీగా ఏర్పడే ఎస్జీటీ పోస్టులను డీఎస్సీలో భర్తీ చేయొచ్చు. – జి.సూర్యుడు, ఎస్జీ టీచరు

డైరెక్టర్‌కు నివేదించాం



ఇంగ్లిష్ పదోన్నతుల అంశాన్ని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు నివేదించాం. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాన్ని బట్టి ముందుకు పోతాం. – ఎం. ప్రసాద్‌బాబు, అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి

ఉపాధ్యాయురాలిపై కేసు నమోదు

కదిరి టౌన్: స్థానిక ఆర్ఎస్ రోడ్డులో నివాసముంటున్న ఉపాధ్యాయురాలు వాణీప్రభావతిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు. వాణీప్రభావతి తన తల్లి ఆస్తి విషయంగా గొడవపడుతూ తనను దుర్భాషలాడి జుట్టు పట్టి లాగి చెప్పుతో కొట్టిందంటూ సోదరుడు మధుసూదన్ భార్య నాగలక్ష్మి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో వాణీప్రభావతిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

బీచ్ కబడ్డీ జట్ల ఎంపిక రేపు

గుంతకల్లు: కాకినాడ వేదికగా మే 2 నుంచి 4వ తేదీ వరకూ జరిగే 12వ అంతర్ జిల్లాల బీచ్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే ఉమ్మడి జిల్లా పురుషులు, మహిళల జట్ల ఎంపికను ఆదివారం (20న) ఉదయం గుంతకల్లులోని రైల్వే క్రీడా మైదానంలో చేపట్టనున్నారు. ఈ మేరకు కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, సహాయ కార్యదర్శి రాఘవేంద్ర శుక్రవారం ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు 94410 53041, 99662 24669లో సంప్రందించాలని కోరారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడి మృతి

- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు
- అడవి పందుల బారి నుంచి పంటను కాపాడుకునేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగే కారణం



మృతుడు ఓబులేసు



గాయపడిన లింగమ్మ





గాయపడిన నాగభూషణ, లక్ష్మి

బత్తలపల్లి: విద్యుత్ షాక్‌కు గురైన వివాహితను కాపాడే ప్రయత్నంలో ఓ వృద్ధుడు ప్రాణాలు కోల్పోయాడు. ఇదే ఘటనలో గాయపడిన ముగ్గురు ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాలు... బత్తలపల్లి మండలం ఎం.చెర్లోపల్లి గ్రామానికి చెందిన కేశవనాయుడు రామాపురం గ్రామానికి చెందిన రామాంజనేయులు పొలాన్ని కౌలుకు తీసుకుని మొక్కజొన్న పంట సాగు చేశాడు. ఈ క్రమంలో అడవి పందులు పంటను నాశనం చేస్తున్నాయని గుర్తించిన ఆయన జీఐ వైరుతో పొలం చుట్టూ విద్యుత్ కంచెను ఏర్పాటు చేశాడు. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం గొర్రెల కాపరులు మేపునకు జీవాలను తోలుకు రావడంతో వారు ప్రమాదం బారిన పడకూడదని భావించిన ఆయన నాలుగు రోజుల క్రితం పొలం చుట్టూ విద్యుత్ కంచెను తొలగించాడు. అయితే విద్యుత్ స్తంభం నుంచి పొలం వరకూ లాగిన వైరును తొలగించడం మరచిపోయాడు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన వివాహిత లక్ష్మి శుక్రవారం దుస్తులు ఉతికేందుకు అటుగా వెళ్లింది. ఆమె వెంట వెళ్లిన కుమారుడు విద్యుత్ తీగ వైపుగా వెళుతుండడం గమనించి కాపాడే ప్రయత్నంలో అటుగా అడుగు వేసింది. అయితే అక్కడ నేల తేమగా ఉండడంతో షాక్‌కు గురైంది. ఆ సమయంలో గట్టిగా కేకలు వేయడంతో అక్కడికి సమీపంలో ఉన్న నాగభూషణ వెళ్లి కట్టెతో తీగను కొట్టాడు. ఆ సమయంలో తీగ ఎగిరి నాగభూషణను తాకడంతో షాక్‌కు గురై కుప్పకూలాడు. విషయాన్ని గమనించగానే తల్లిదండ్రులు ఓబులేసు (69), లింగమ్మ ఒకరి వెనుక మరొకరు పరుగున వెళ్లి నాగభూషణను పైకి లేపే ప్రయత్నం చేయడంతో వారు కూడా షాక్‌కు గురయ్యారు. విషయాన్ని అక్కడికి సమీపంలో ఉన్న రవీంద్రారెడ్డి గమనించి వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ వద్దకెళ్లి విద్యుత్ సరఫరాను నిలిపివేశాడు. షాక్‌కు గురైన నలుగురూ అపస్మారక స్థితిలో ఉండడంతో గ్రామస్తులు వెంటనే ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స అందేలోపు ఓబులేసు మృతి చెందాడు. మిగిలిన ముగ్గురికి ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఆర్డీటీ ఆస్పత్రికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న ట్రాన్స్‌కో ఏఈ శివయ్య గ్రామానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను ఆరా తీశారు. ఘటనపై బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

లారీని ఢీ కొన్న ట్రావెల్ బస్సు



దెబ్బతిన్న బస్సు ముందు భాగం

పెనుకొండ రూరల్: ముందు వెలుతున్న లారీని ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళుతున్న సీజీఆర్ ట్రావెల్స్ బస్సు పెనుకొండ సమీపంలోని గోనిపేట వద్దకు చేరుకోగానే 44వ జాతీయ రహదారిపై ఎదురుగా వెళుతునన లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో డ్రైవర్ నియంత్రణ కోల్పోయి ఢీకొంది. ఘటనలో హైదరాబాద్‌లోని అమీర్ పేటకు చెందిన మహమ్మద్ షరీఫ్, అహమ్మద్ షరీఫ్ గాయపడ్డారు. అటుగా వెళుతున్న వారు గుర్తించి సమాచారం ఇవ్వడంతో 108 సిబ్బంది అక్కడకు చేరుకుని క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పిడుగుపాటుతో ఆవు మృతి

నల్లచెరువు: పిడుగు పాటుతో ఆవు మృతి చెందిన ఘటన మండలంలోని కె పూలకుంట గ్రామంలో చోటు చేసుకుంది. శుక్రవారం గ్రామంలో ఉరుములు, మెరుపులతో కూడిన చిన్నపాటి వర్షం కురిసింది. ఆ సమయంలో పిడుగు పడడంతో గ్రామానికి చెందిన రైతు సుధాకర్ రూ.65 వేలు విలువ చేసే పాడి ఆవు మృతిచెందింది.

కల్లుమర్రిలో చైన్‌స్నాచింగ్

మడకశిర రూరల్: మండలంలోని కల్లుమర్రి గ్రామ సమీపంలో మహిళ మెడలోని బంగారు గొలుసును ఓ దుండుగుడు లాక్కొని వెళ్లాడు. వివరాలు.. శుక్రవారం ఉదయం కల్లుమర్రి గ్రామానికి చెందిన రైతు శ్రీనివాస్, సుహాసిని దంపతులు పొలం వద్దకు నడుచుకుంటూ వెళుతుండగా గుర్తు తెలియని యువకులు శ్రీనివాస్ వద్ద సెల్‌ఫోన్, సుహాసిని మెడలోని బంగారు గొలుసును లాక్కొని ద్విచక్ర వాహనంపై ఉడాయించారు. ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

తాగునీటి కోసం కత్తితో దాడి

కళ్యాణదుర్గం రూరల్: శ్రీరామరెడ్డి తాగునీటి సరఫరా పథకం కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో పట్టణ పరిధిలో తాగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఈ క్రమంలో స్థానిక వడ్డే కాలనీలో తాగునీటి కోసం పరస్పర దాడులు చోటు చేసుకుని, ముగ్గురు కత్తి పోట్లకు గురయ్యారు. శుక్రవారం రాత్రి నీళ్ల కోసం ప్రకాష్, లక్ష్మి, గణేష్‌పై బోయ హనుమంతురాయుడు, వడ్డే సాంబ, వడ్డే పవన్ గొడవపడ్డారు. ఇరు వర్గాల మధ్య మాటామాట పెరగడంతో పరస్పరం దాడులకు తెగబడ్డారు. ఘటనలో హనుమంతురాయుడు, సాంబ, పవన్‌పై ప్రకాష్ కత్తితో దాడి చేసి గాయపరిచాడు. క్షతగాత్రులను స్థానికులు సీహెచ్‌సీకి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి దుర్మరణం

అనంతపురం: నగర శివారులో చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన మేరకు... రాప్తాడు మండలం బండమీదపల్లికి చెందిన ఎర్రగుంట్ల రంగారెడ్డి (46) శుక్రవారం ఉదయం అనంతపురంలో జరుగుతున్న శుభకార్యానికి హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. 44వ జాతీయ రహదారిపై ఆర్‌కే ఫంక్షన్ హాల్ ఎదురుగా ప్రయాణిస్తుండగా ఎదురుగా రాంగ్ రూట్‌లో వచ్చిన చంద్రబాబు కొట్టాలకు చెందిన బైక్ మెకానిక్ షేక్ రహమాన్ ఢీకొన్నాడు. ఘటనలో కిందపడిన రంగారెడ్డి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పాఠశాల ప్రాంగణంలో క్షుద్ర పూజలు



క్షుద్ర పూజలు చేసిన దృశ్యం

ఎన్పీకుంట: మండలంలోని గొకనపల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం పాఠశాలకు సెలవు కావడంతో ఉదయం 11 గంటల సమయంలో పాఠశాల వైపుగా వెళుతున్న గ్రామస్తులు ప్రాంగణంలో ముగ్గు వేసి నిమ్మకాయలు, ఎముకలు ఉంచిన దృశ్యాన్ని గమనించి ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన కిసాన్ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి సమీవుల్లా వెంటనే సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ప్రస్తుతం పాఠశాల ఉన్న ప్రాంతంలో ఒకప్పుడు కోట ఉండేదని, దీంతో గుప్త నిధుల కోసం ఇలాంటి చర్యలకు పాల్పడి ఉంటారనే అనుమానాలను స్థానికులు వ్యక్తం చేశారు.

రెండేళ్లలో పెనుకొండ మెడికల్ కళాశాల పూర్తి

- మంత్రి సత్యకుమార్



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న వారితో మంత్రి సత్యకుమార్

పెనుకొండ: మరో రెండేళ్లలో పెనుకొండ మెడికల్ కళాశాలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కళాశాల అవసరమన్న భావనతో 17 కొత్త వైద్య కళాశాలలను మంజూరు చేసిందన్నారు. వైద్య కళాశాలలకు సిబ్బంది కొరత ఎక్కువగా ఉందన్నారు. సరిపడిన ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెంట్లు లేరన్నారు. అరకొర వసతులతో వైద్య కళాశాలలను నడపడం కష్టమన్నారు. దీంతో పలు అంశాలను పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర వ్యాప్తంగా 10 వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో నిర్మిస్తున్నట్లు తెలిపారు. 33 ఏళ్ల పాటు లీజు ప్రాతిపదికన వీటిని ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తామన్నారు. ఇందులో నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రధానమైన షరతుగా ఉంటుందని పేర్కొన్నారు.

ప్రజారోగ్యానికి తొలి ప్రాధాన్యత..

ధర్మవరం అర్బన్: రాష్ట్రంలో ప్రజారోగ్యానికి తొలి ప్రాధాన్యతనిస్తున్నట్లు మంత్రి సత్యకుమార్ తెలిపారు. స్థానిక ఎన్డీఏ కార్యాలయంలో శుక్రవారం 51 మంది బాధితులకు రూ.42లక్షలు విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేసి, మాట్లాడారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో 10 పడకల డయాలసిస్ సెంటర్ ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. 4 ఎకరాల్లో ఎలక్ట్రిక్ శ్మశాన వాటిక నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, మార్కెట్ యార్డు చైర్మన్ అంబటి అరుణశ్రీ, పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.